ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఆర్డీఓ

దేవులమ్మ నాగారంలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 27 : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవులమ్మ నాగారం గ్రామంలోని ప్రభుత్వ భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రజా సంక్షేమం కోసం ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు.

బ్జాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆయన వెంట తాసీల్దార్ హరికృష్ణ ఉన్నారు.

ఎంపీ లక్ష్మణ్‌ను కలిసిన ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు

చౌటుప్పల్, డిసెంబర్ 27 : రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు శుక్రవారం రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కలిశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ఓఆర్ఆర్ నుంచి 28 కిలోమీటర్లకు బదులుగా 40కిలోమీటర్లకు మార్చాలని వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత అలైన్‌మెంట్ మూలంగా చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ మున్సిపాలిటీలు రెండు భాగాలుగా విడిపోతున్నాయన్నారు. గతంలో వివిధ ప్రాజెక్టులకు భూములు కోల్పోయామని, ఇప్పుడున్న కాస్త భూమి పోతే జీవనోపాధి లేక రోడ్డు మీద పడుతామని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, భూ నిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, రాములు గౌడ్, ఉపేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నర్సింహ యాదవ్, వెంకటేశం యాదవ్, గాలయ్య యాదవ్, వేణుయాదవ్ పాల్గొన్నారు.

హక్కులు సాధించే వరకు పోరాటం ఆపొద్దు

- ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారధన్

కలెక్టరేట్ వద్ద సమ్మె చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 27 : తమ న్యాయమైన హక్కులు సాధించుకునే వరకు పోరాటాలను ఆపొద్దని, సమ్మెకు అన్ని విధాలా అండగా ఉంటామని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 18వ రోజు కొనసాగింది. శుక్రవారం సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దామెర ఉపేందర్, దామెర బాబూరావు, సుధాకర్, భిక్షమయ్య, రవీందర్, యాకస్వామి, యాదగిరి, వెంకటేశ్వర్లు, సైదులు, పాండరి, తిరుపతి, నాగార్జున పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 27 : సమగ్ర శిక్ష ఉద్యోగులు, సీఆర్‌టీల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొరతం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేయడం విరమించుకోవాలన్నారు. సమాన వేతనం అందజేసి ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరూర్ ఎల్లయ్య, దొడ్డి రవి, సోమయ్య, యాదమ్మ, శ్రీను పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

భువనగిరి అర్బన్, డిసెంబర్ 27 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా నిజమైన నిరుపేదలను ఎంపిక చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన పార్టీ భువనగిరి మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను ప్రజలందరినీ భాగస్వామ్యం చేసి ఎంపిక చేయాలన్నారు. తమ పార్టీ కార్యకర్తలతో కమిటీలు వేసి ఎంపిక చేస్తామని చెప్పడం సరికాదన్నారు. బస్వాపురం ప్రాజెక్టుకు వెంటనే నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని కోరారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఐటీఐ దగ్గర అండర్ పాస్ నిర్మాణం కోసం ఈ నెల 30, 31 తేదీల్లో నిరసన దీక్షలు చేపడుతామని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నరసింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు సిలువేరు ఎల్లయ్య, పాండాల మైసయ్య, మోటె ఎల్లయ్య, వెంకటేశ్, యాదగిరి, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- సీపీఐ ల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

సీపీఐ జెండాను ఎగురవేస్తున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 27 : నల్లగొండలో ఈ నెల 30న జరిగే సీపీఐ శత వసంతాల జయంత్యుత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని తన ఇంటి మీద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పేదల పక్షాన నిలబడిందన్నారు. కార్మిక వర్గ దృక్పథంతో నిరుపేదలకు ఇండ్లు, లక్షల ఎకరాల భూమి పంపిణీలో సీపీఐ పాత్ర కీలకమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీదర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు పాల్గొన్నారు.

కొత్త చెరువు పంట కాల్వలో పూడికతీత

చెరువు కాల్వలో పూడిత తీయిస్తున్న రైతులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 27 : మండల కేంద్రంలోని వీర్ల చెరువు నుంచి కొత్త చెరువు వరకు ఉన్న పంట కాల్వలో కంపచెట్లు మొలవడంతోపాటు మట్టితో పూడిపోయింది. వీర్ల చెరువులోకి గోదావరి జలాలు వస్తుండడంతో కొత్త చెరువులోకి నీటిని వదిలేందుకు శుక్రవారం రైతులు సొంత ఖర్చుతో జేసీబీతో పూడికతీత పనులు చేపట్టారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి

- గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్

భువనగిరి కలెక్టరేట్ : ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాండు

బీబీనగర్, డిసెంబర్ 27 : గ్రామపంచాయతీ సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి శుక్రవారం నిర్వహించిన సమ్మెలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 60వేల మంది కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి, విరమణ పొందిన వారికి రూ.10లక్షలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గాడి శ్రీనివాస్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, జిల్లా కార్యదర్శి గడ్డం ఈశ్వర్, మండలాధ్యక్షుడు పాశం బాలయ్య, నాయకులు రమేశ్, పోచయ్య, గోవిందు, స్వామి, లింగమ్మ, శోభ, వెంకటమ్మ, జంగమ్మ, లక్ష్మి, అండమ్మ యాదమ్మ, కిష్టమ్మ, నాగమణి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు(ఎం) : గ్రామపంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే నిరవధిక సమ్మె చేపడుతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి చేపట్టిన సమ్మెలో ఆయన మాట్లాడారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం చేపట్టిన చలో కలెక్టరేట్‌కు గ్రామపంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు కూరెళ్ల కిష్టయ్య, నాయకులు నోముల స్వామి, శ్రీను, లక్ష్మయ్య, మల్లయ్య, ముత్తయ్య, నర్సింహ, సైదులు, నర్సింహాచారి, రామచంద్రు, లక్ష్మి, యాదమ్మ, పద్మ, లలిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

భువనగిరి కలెక్టరేట్ : గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమవుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు సంవత్సరాల తరబడిగా అనేక రకాల పనులు చేస్తున్నా పాలకులు వారి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క సమస్యా పరిష్కారం చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, గుర్తింపు కార్డులు ఇచ్చి అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ మండలాధ్యక్షుడు బొల్లెపల్లి స్వామి, నాయకులు ఐలయ్య, శంకర్, ఎల్లేశ్, కోటేశ్, మహేందర్, అనిత, పద్మ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

రామన్నపేట : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన టోకెన్ సమ్మెను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండెల భిక్షం, మండలాధ్యక్షుడు గాదె ఎల్లయ్య, నాయకులు నకిరేకంటి రాము, రేణుక, నర్సింహ, లక్ష్మమ్మ, యాదమ్మ, ముత్తయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా మాట్లాడుతూ జీఓ 51ని సవరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మాండ్ల శ్రీను, నాయకులు పాపయ్య, నందీశ్వర్ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె నిర్వహించారు. సమ్మెకు ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మంచాల మధు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సలీం, బాబు, స్వామి, శంకర్, దుర్గయ్య, శారద, జయమ్మ, గంగయ్య, శైలజ, శ్రీశైలం, ఇస్తారి పాల్గొన్నారు.

బీబీనగర్ : ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

చౌటుప్పల్ రూరల్ : ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

రామన్నపేట : ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

రాజాపేటలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుర్కపల్లి, డిసెంబర్ 27 : మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యామహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, రాజయ్య, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి

రాజాపేట : మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, నాయకులు సందిల భాస్కర్‌గౌడ్, ఉప్పలయ్య, వీరేశం, గోపిరెడ్డి, వెంకటేశ్, రాజు, రాములునాయక్, భాగ్యమ్మ, భాస్కర్, కరుణాకర్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ నివాళి అర్పించారు.

భువనగిరి కలెక్టరేట్/ వలిగొండ/ భూదాన్ పోచంపల్లి/ భువనగిరి అర్బన్ : భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మాజీ సర్పంచ్ పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్ నివాళి అర్పించారు. వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌక్ వద్ద, పోచంపల్లిలోని నేతాజీ చౌరస్తాలో, భువనగిరి పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

చౌటుప్పల్ : పట్టణంలోని బస్టాండ్ వద్ద మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నాయకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు వెళ్లి వస్తుండగా ప్రమాదం

- ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- మహిళ మృతి.. ఆమె భర్త, ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 27 : యాదగిరిగుట్టకు దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా.. ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త, కుమారుడు, కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాద ఘటన భువనగిరి పట్టణ పరిధి రాయగిరి బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ వి.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చంపాపేటకు చెందిన బైగళ్ల జగన్, పావని దంపతులు తమ కుమారుడు కన్నయ్య, కుమార్తె సాత్వికతో కలిసి ద్విచక్ర వాహనంపై యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం వచ్చారు. స్వామివారిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో రాయగిరి న్యూదీప్తి హోటల్ వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పావని(30) కిందపడగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. జగన్, కన్నయ్య, సాత్వికకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పావని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెడ్డిబావి గ్రామంలో చోరీ

రెడ్డిబావి గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ యాదగిరి

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 27 : మండలంలోని రెడ్డిబావి గ్రామంలో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన నందగిరి నరేశ్ ఇంట్లో ఎవరూ లేని రాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు పది వేల నగదు దోచుకెళ్లారు. పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

నేరాలపై అవగాహన

రెడ్డిబావి గ్రామంలో ఎస్ఐ యాదగిరి ఆధ్వర్యంలో నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. డ్రగ్స్ వాడకం, సైబర్ నేరాలపై వివరించారు.

ఆర్థిక సాయం

సత్తయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 27 : అనారోగ్యంతో మృతిచెందిన తాజ్‌పూర్ గ్రామానికి చెందిన మావురం సత్తయ్య కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ శుక్రవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ఇల్లు లేని సత్తయ్య కుటుంబానికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి బొమ్మరపు బాలరాజు, నాయకులు సందీప్‌కుమార్, షరీఫ్, అనిల్, సతీశ్, కొండల్ పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని వినతి

రామన్నపేట, డిసెంబర్ 27 : కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి రామన్నపేట యువకులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట నుంచి రోజూ వందల మంది ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు రైలు ప్రయాణం చేస్తుంటారన్నారు. కరోనా సమయంలో రైళ్లను రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రామన్నపేటలో మెమో ట్రైన్ స్టాప్‌ను కూడా రద్దు చేయాలనే ఆలోచనలో ఉన్నారని, దానిని వెంటనే విరమించుకొని యథావిధిగా ట్రైన్లను నడుపాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రేవల్లి విజయ్‌కుమార్, దామెర అంజయ్య, బండారపు కృష్ణ, మల్లేశ్, శ్రీకాంత్, నారాయణ, పరశురాం ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 27 : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపల్లి మండలం కొండూరు గ్రామంలో నివాసం ఉంటున్న కర్రె రాజిరెడ్డి (45) హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 16న ఆఫీసుకు వెళ్తానని ఇంట్లో నుంచి వెళ్లిన రాజిరెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆయన భార్య సరళ 17న బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల 18న భువనగిరిలోని ఓ లాడ్జి నుంచి రాజిరెడ్డి వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి పురుగుల మందు డబ్బాను చూపించి తాగాడు. అలాగే తన భార్య ఫోన్‌కు లొకేషన్ పెట్టాడు. లొకేషన్ ఆధారంగా లాడ్జి నంబర్ కనుక్కొని యజమానికి చెప్పగా.. వారు వెంటనే ఏరియా దవాఖానకు తరలించారు. రాజిరెడ్డి పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు, అక్కడి నుంచి నిమ్స్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. రాజిరెడ్డి భార్య సరళ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలి

మంత్రి సీతక్కను కలిసిన ఇంజ ఫౌండేషన్ ప్రతినిధి నరేశ్

రాజాపేట, డిసెంబర్ 27 : మండలంలోని కాల్వపల్లికి చెందిన ఇంజ ఫౌండేషన్ ప్రతినిధి ఇంజ నరేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాజాపేట మండల అభివృద్ధి కోసం అత్యధిక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నరేశ్ తెలిపారు.

గ్రామ అభివృద్ధికి సహకరించాలని వినతి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన మొగిలిపాక దేవాలయాల కమిటీ సభ్యులు

వలిగొండ, డిసెంబర్ 27 : మండలంలోని మొగిలిపాక గ్రామంలోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధితోపాటు దేవాలయాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మొగిలిపాక గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి, మామిడి సత్తిరెడ్డి, సామ రాంరెడ్డి, ముద్దసాని లక్ష్మారెడ్డి, జయసింహారెడ్డి, వెంకన్న, రాంచంద్రారెడ్డి, అంజిరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 27 : రూ.10వేల కోట్లు విడుదల చేసి రుణమాఫీ కాని రైతులందరికీ మాఫీ చేయాలని, రైతు భరోసా ఎకరానిక